38, 42 డివిజన్లో అభివృద్ధి పనులను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 38, 42 డివిజన్లో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభోత్సవాలు చేశారు. 38వ డివిజన్లో 24 లక్షలతో చేపట్టిన రహదారుల నిర్మాణానికి ,42 డివిజన్లో 8.60 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి ప్రారంభోత్సవం చేసి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, కార్పొరేటర్లు తొగురోతు సంధ్యారాణి, పిన్నింటి కళావతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన డివిజన్లో కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో అభివృద్ధి పనులు నరవేగంగా సాగుతున్నాయన్నారు. నగరంలో ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు శివారు ప్రాంతాల అభివృద్ధి పైన ఆయన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారన్నారు. దీనివలన నగరంలో అభివృద్ధి దూసుకుపోయే విధంగా కనబడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. నగరం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న రోజుల్లో మరల శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించే దిశగా రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజల నుండి సమస్యలను తెలుసుకున్న వెంటనే వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చూపుతున్నారన్నారు. నగరీకరణగా రూపాంతరం చెందిన తర్వాత అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టడం ప్రజల అదృష్టం అన్నారు. మౌలిక

సదుపాయాలు కల్పించిన తర్వాత శివారు ప్రాంతాలలో ఉన్న స్థలాలకు విలువ పెరిగే అవకాశం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, నారాయణప్పుడు తదితరులు పాల్గొన్నారు.

పంట కొనుగోలుచేసి అప్పులోకి కూరుకుపోయిన మామిడి రైతులు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో పలు గ్రామాల్లో మామిడి తోటల పంట కొనుగోలు చేసిన రైతులు తీవ్రమైన అప్పులోకి కూరుకుపోయామని ఆందోళన చెందుతున్నారు. 2023 ఏప్రిల్ మొదటి రోజున కేజీ మామిడి కాయ పనుకులు, సువంరేఖ 90 రూపాయిలు చొప్పున టన్ను 90,000 కు కొనే వారని, బంగారం కన్నా రైతు అధికంగా ఉన్నది అని ఉద్దేశంతో అప్పటివరకు రైతు దగ్గర ఉన్న మామిడి తోటలను ఈ రేటును చూసి కౌలు రైతులు కొనుగోలు చెయ్యడం మొదలు పెట్టామని అన్నారు. రైతు చేతి నుంచి వ్యాపారస్తుల చేతుల్లోకి వెళ్ళేసరికి రోజుకు ఒక రేటు చొప్పున మామిడి కాయ రేటు పడిపోయింది అని అన్నారు. అప్పుడు 90 నుంచి 80,70,60 రూపాయిలు చొప్పున రోజు రోజుకు రేటు దిగుతూ , మే నెల 10వ తేదీ నుంచి కేజీ 10 రూపాయిలు దిగిపోయి టన్ను 10,000 అయిపోయింది అని అలా చెట్లు పై ఉన్న కాయలు మే నెల 30వ తేదీ కి పండి పోయి రాలిపోయి మామిడి కాయ అంటే ఎవ్వరూ కొనే పరిస్థితి లేదని, రాలి పోయిన పల్లు అయిన ఎంతో కొంత కు సొమ్ము చేసుకుందాం అంటే బయటకు పండు చూస్తే బానే ఉంటుంది కానీ లోపల పండు కు పురుగులు పట్టేయడం వలన ఎవ్వరు కొనే పరిస్థితి లేదని వాపోతున్నారు. అలాగే అప్పులు చేసి ఇంట్లో దాచుకున్న నగదు,అబరనాలు బ్యాంకుల్లో పద్దులు పెట్టీ వ్యాపారం మీద పెట్టమని పూర్తిగా అప్పులు ఊబిలో కూరుకుపోయామని, మా పరిస్థితులు బాగోలేవని తీవ్రమైన వడగాల్పులు సైతం లెక్క చెయ్యకుండా మామిడి పంటలులో నిమగ్నం అయ్యామని, ఎండకు ఎండి పోయి ప్రాణాలు అల్లాడిపోయిన తోటల్లో పని చేసినప్పటికీ సుఖం లేదని, వ్యాపారం ముగిసిన వెంటనే అప్పులు వాడు ఇంటి మీదకు వచ్చి పడతాడని, ఏమి చేసి తీర్చాలో తెలియని పరిస్థితి అని ఆందోళన చెందుతున్న మామిడి రైతన్నలు పెరుమాలి, తెర్లాం, కూనాయవలస, వెలగవలసా, ఎమ్మార్ అగ్రహారం, రంగప్పవలస, జే.కొత్తవలస పూనువలస తదితర గ్రామాల మామిడి రైతన్నలు ఆందోళన లో ఉన్నామని తెలిపారు.

కోటి చెరువు భూములను జిరాయితీ భూములుగా నమోదు చేయడం ఏమిటి?

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో నాయుడు కాలనీ పక్కనే ఉన్న కోటి చెరువు భూములను జిరాయితీ భూములుగా రెవెన్యూ రికార్డులలో నమోదు చేసిన అధికారులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న హెచ్చరించారు.. గతంలో రెవెన్యూ యంత్రాంగానికి సంబంధించి కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం. రాజకీయ ఒత్తిళ్లకు లోబడి కోటి చెరువు భూములను కొంతమేర ఓ రాజకీయవేత్తకు రియల్ ఎస్టేట్ వెంచర్ వేసుకోవడానికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని. ఆ వెంచర్ను ఇంకో రియల్ ఎస్టేట్ వ్యక్తికి అమ్మకం కూడా జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కోటి చెరువు సగభాగం వరకు జిరాయితి భూములు ఉంటే మరి కోటి చెరువు విస్తీర్ణం 72 ఎకరాలు భూమి ఎక్కడుందో ఈ రెవెన్యూ మరియు ఇరిగేషన్ అధికారులే సర్వే జరిపి పత్రికా ముఖంగా పట్టణ ప్రజానీకానికి సమాధానం తెలియజేయాలని, అలాగే. కోటి చెరువు విస్తీర్ణం ఎంత ఉందో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, కోటి చెరువు భూములను కబ్జా చేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బొబ్బిలి పట్టణంలో జరుగుతున్న భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా ఈ సందర్భంగా కోరారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు భవాని

విశాలాంధ్ర-నెల్లిమర్ల: జాతీయ స్థాయి అండర్ 19 స్కూల్ గేమ్స్ కబడ్డీ చాంపియన్ షిప్ కు నెల్లిమర్లకు క్రీడాకారిణి తామాడ భవాని ఎంపికైనట్లు విశ్రాంత పీడీ, కోచ్ బొమ్మన కరామారావు తెలిపారు. నెల్లిమర్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు దేశరాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న కబడ్డీ పోటీలలో భవాని ఆంధ్రప్రదేశ్ జట్టుతరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. భవాని నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భవానిని ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, నెల్లిమర్ల కబడ్డీ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు బోని సత్యనారాయణ అభినందించారు.

వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-కొత్తవలస: స్థానిక తుమ్మికపల్లిలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 37 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ అధ్యక్షతన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కదారి రాజు, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయి రమణ,డాక్టర్ రవి పాల్గొన్నారు. కదారి రాజు మాట్లాడుతూ ప్రతీ నెలా ఇలాంటి సేవా కార్యక్రమాల చేయడం చాలా గొప్ప విషయమని రానున్న రోజుల్లో ఈ ట్రస్ట్ అంచలంచలుగా ఎదిగి ఎంతోమంది అనాధ వృద్ధులను ఆదుకోవాలని వాటికి మా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ హరికుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా సుమారు 10 సంవత్సరాల నుండి ఎన్నో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, అనాధ శవాలకు అంత్యక్రియలు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటువంటి వృద్ధులను కడదాకా ఆదుకుంటామని ఒక సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందు కొచ్చి ట్రస్టులో సభ్యులుగా చేరి సహాయ సహకారాలు అందిస్తారని మనస్ఫూర్తిగా కోరుతున్నామన్నరు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్,నగేష్, గోవిందరావు, మల్లేశ్వరరావు, ధర్మ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

తెలుగుజాతి కీర్తి శిఖరం ఎస్పీ బాలు

భీశెట్టి బాబ్జీ

విశాలాంధ్ర-జామి: ప్రపంచంలోనే అద్భుతమైన గాయకుడి గా పేరు తెచ్చుకున్న మహో న్నత వ్యక్తి తెలుగు జాతి కీర్తి శిఖరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్య మని డాక్టర్ పీవీజీ రాజు కళావేధిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. ఆదివారం మండలంలోని అట్టాడ బి.ఎన్.ఆర్.ఆశ్రమంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ముందుగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 భాషల్లో దాదాపు 45 వేల పాటలు పాడిన బాలు భారతీయ సంగీత విద్వాంసులు మనో ఫలకంపై చెరగని ముద్రవేశారని అన్నారు. సంగీత సామ్రాజ్యాన్ని అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయిన బాలు, తన కమ్మని గొంతుతో పాడిన పాటలు ప్రపంచ వ్యాప్తంగా సంగీత అభిమానులకు అందచేసి వెళ్లిపోయారని భీశెట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం బాలు పుట్టినరోజు సందర్భంగా వేడుకలు చేయాలనీ, బాలుపేరుతో యువ సంగీత కళాకారులకు అవార్డులు అంద చెయ్యాలని కోరారు,వేల మంది సంగీత కళాకారులను తయారుచేసిన ఘనత దేశంలో ఒక్క ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కి మాత్రమే దక్కుతుందని అన్నారు, లిమృతులకు ఘన నివా ళులర్పించిన వృద్ధులు ఒడిశాలో ని బాలేశ్వర్ జిల్లా బహనగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన కోరమండల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్, యశ్వంత్ పూర్ ఎక్స్ప్రెస్ ప్రమాదంలో మృతి చెందిన సుమారు 288 ఆత్మకి శాంతి కలగాలని బి.ఎన్.ఆర్.ఆశ్రమంలో ని వృద్ధులు కొవ్వొత్తులను వెలిగించి ఘన నివాళులు అర్పించారు ప్రమాదంలో గాయపడిన సుమారు 1175 మంది త్వరగా కోలుకోవాలని, ప్రమాదంలో చనిపోయిన పేద కుటుంబాల కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత రీతిన ఆదుకోవాలని,వారికి విద్యా, ఉపాధి అవకాశాలు అందించాలని వారు కోరారు, సమావేశంలో ఆశ్రమం నిర్వాహకులు మట్టా రామగున్న, అచ్చిరాజు, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా బాలు జయంతి వేడుకలు

సహాయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళులు

గరివిడి : పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న సహాయ్ పార్కు నందు గల క్రీస్తు శేషులు ప్రముఖ సినీ కళాకారుడు గాన గంధర్వుడు ఎస్.పీ. బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను స్థానిక పట్టణాని కి చెందిన సహాయ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 76 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహాయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, గరివిడి మండలం జడ్పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు, చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవరావు హాజరయ్యారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని గరివిడి పట్టణంలో మొట్టమొదటిసారిగా స్థాపించిన ఘనత సహాయ స్వచ్ఛంద సంస్థ దేనని ఆయన అన్నారు. బాల సుబ్రహ్మణ్యం మరణం సంగీత లోకానికి తీరని లోటని, ఆయన కొన్ని వేల సంఖ్యలో వివిధ భాషలలో పాటలను వినిపించారు అని, ఈ భూమి మీద సంగీతం ఉన్నంతకాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, అన్నారు. అటువంటి కళాకారులు ఈ భూమ్మీద అరుదుగా జన్మిస్తారని, వారు కారణజన్ములు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ కంపెనీ డైరెక్టర్ వాకాడ గోపి, డిసిసిబి డైరెక్టర్ శివుకు కాంతారావు, ఆయుర్వేద డాక్టర్ సుందర రాజన్ పెరుమాళ్, ఉప్పు శ్రీనివాసరావు, బడిగంట సీతారాం, , సత్య శ్రీనివాస్, శంకర్రావు, పలువురు గాయకులు పాల్గొన్నారు.

చాకివలసలో ఏరువాక పూర్ణిమ

- అన్నదాత ను అన్యాయం చేస్తున్న దగాకోరు వైసిపిని గద్దెదించాలి : కర్రోతు

విశాలాంధ్ర-భోగాపురం: సంపద సృష్టించి సంక్షేమంతో పాటు అభివృద్ధిని తారా స్థాయి కి తీసుకెళ్లగల సత్తా ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందని, అన్నదాత ను అన్యాయం చేస్తున్న దగాకోరు వైసిపి ప్రభుత్వంను గద్దె దించాలని నెల్లిమర్ల నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలో చాకివసల గ్రామంలో నెల్లిమర్ల నియోజక వర్గ టిడిపి నాయకులు, స్థానిక రైతులతో ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, ఇంచార్జి బంగార్రాజు నియోజకవర్గ నాయకులు కలసి పొలములో దుక్కి దున్ని కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం ఒక యజ్ఞం వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందు భూమి పూజ చేసి దుక్కి దున్నడం అనాదిగా వస్తున్న ఆచారం. పంచభూతాత్మకమైన ప్రకృతిని దైవంగా ఆరాధించడం భారతీయుల సంప్రదాయం కనుక తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు తెలుగుదేశం పార్టీ పెద్ద పీట వేస్తుందని అందుకే ప్రతీ సంవత్సరం అధినాయకుడు చంద్రబాబు ఆదేశాల మేరకు ఏరువాక పూర్ణిమ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత వైసిపి పాలనలో రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడ్డారని, మిల్లర్లు దగా చేసి రైతుల పంటను దోచుకున్నాప్రభుత్వం ఏమి పట్టనట్టు చూసిందన్నారు. టి డి పి ప్రభుత్వ హయాంలో కేజీ విత్తనాలు 7 రూపాయలు అందిస్తే ప్రస్తుత ప్రభుత్వం 10 రూపాయకు అమ్ముకోవడం అన్యాయమన్నారు. ఆంధ్ర ప్రదేశ్ జీవనాడి పోలవరంను ఇప్పటికి ప్రభుత్వం పూర్తీ చేయలేకపోయిందని ,కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ యంత్ర పరికరాలు అద్దెకు ఇచ్చే "కస్టమ్ హైరింగ్" పథకం ను వినియోగించుకోవడంలో మిగతా అన్ని రాష్టాల కన్నా అట్టడుగు స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ రావు,భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ , పుసపాటిరేగ మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకర్రావు ,డెంకాడ మాజీ జెడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు ఆకిరీ ప్రసాద్ రావు ,పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి గేదెల రాజారావు ,పార్లమెంట్ కార్యదర్శి లంక అప్పలనాయుడు ,మాజీ సి హెచ్ సి చైర్మన్ పతివాడ తమ్మినాయుడు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి దంగ భూలోక ,రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పతివాడ సాగర్ నాయుడు, టిడిపి యువ నాయకులు అట్టాడ శ్రీధర్ ,భోగాపురం క్లస్టర్ ఇంఛార్జి పిడుగు తోటరావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

5 నుండి 17వ తేదీ వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు

విశాలాంధ్ర-బెలగాం : ఈనెల 5వ తేదీ నుండి 17వ తేదీ వరకు అతిసార నియంత్రణ పక్షోత్స వాలు (ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్-ఐసిడిఎఫ్) నిర్వహించడం జరుగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో బాగంగా వైద్య సిబ్బంది తదితర శాఖల సిబ్బంది సమన్వ యంతో చేపట్టాల్సిన నిర్వహణలను సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, హెల్త్ వెల్నెస్ సెంటర్, అంగన్వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా ఓఆర్ఎస్-జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని, తగిన మోతాదులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. 5.సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ఇళ్లకు ఆశా కార్యకర్తలు ఎఎన్ఎంలు వెళ్లినప్పుడు కమ్యూనిటీ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా ఆ ఇంటిలోని తల్లులకు ఈ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. వారి ఇంటిలోని 5.సంవత్సరాల లోపు పిల్లలకు డయేరియా వస్తే ముందుగా ఎవరిని సంప్రదించాలి, ఇంటిలోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏఏ ప్రదేశాలలో అందుబాటులో ఉంటాయి, ఐదు సంవత్సరాలలోపు పిల్లలలో డయేరియా వ్యాధి వచ్చినప్పుడు కనిపించే "ప్రమాద సూచికలు, తల్లిపాలు తాగించడం కంటిన్యూ చేయవలెనని తల్లులకు మొదలగు అంశాలపై అవగాహన కల్పించచాలని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ప్రమాదకర అనారోగ్య పరిస్థితికి అతిసార వ్యాధి ఒక కారణమని అన్నారు. ఒఆర్ఎస్ ద్రావణాన్ని పిల్లలకు 2 నెలల లోపు అయితే ఐదు స్పూన్లు, 2నెలలు నుండి 2 సం. అయితే పావు కప్పు నుండి అర కప్పు వరకు, ఐదు సం. వరకు అయితే అర కప్పు నుండి ఒక కప్పు వరకు విరేచనం తర్వాత ఇవ్వాలని, అదే విధంగా జింక్ మాత్రలను 2 నుండి 6 నెలల పిల్లలకు అర ముక్క, ఐదు సం. వరకు అయితే ఒక మాత్ర పాలలో లేదా మంచి నీటిలో కలిపి ఇవ్వాలన్నారు. డయేరియా తగ్గినప్పటికీ జింక్ మాత్రలు 14 రోజులు వరకు కొనసాగించాలన్నారు.

లచ్చయ్యపేటవద్ద గుర్తుతెలియని మృతదేహం



విశాలాంధ్ర-సీతానగరం: మండలం లోని లచ్చయ్యపేట గ్రామంలో రాష్ట్రీ య రహదారి పక్కనగల నీటిగుంటలో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం ఉదయం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ లెంక శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది సోమేశ్వరరావు, అప్పలకొండలు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి సంబందించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. స్థానికుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసారు. 30నుండి 35 సంవత్సరాల మద్య వయస్సు, 5.6 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు, ఎరుపు రంగు షర్టు, నీలం జీన్ ప్యాంటు టక్ చేసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని సమాచారం తెలిస్తే సీతానగరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో పోస్ట్మార్టం గదిలో ఉంచేందుకు తరలిం చామని చెప్పారు. మృతుడు పిట్స్ వంటి వ్యాధి లక్షణాలతో చనిపోయాడా, ఇంకేమైనా జరిగిందా అన్నది కూడా పోలీసులు విచారణ చేయాల్సివుంది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

జి ఎల్ పురం మండలంలో పిఓ విష్ణుచరణ్ విస్తృత పర్యటన

విశాలాంధ్ర-కురుపాం: జి ఎల్ పురం మండలంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ శనివారం విస్తృతంగా పర్యటించారు. సవరకోటపాడు గ్రామంలో గల హెచ్.ఎన్.టి.సిలో పర్యాటక పనులు పరిశీలించారు. లక్కగుడ గ్రామంలో చెరువుల పనులు పరిశీలించడమే కాకుండా ఆయిల్ ఇంజిన్ లను, స్ప్రేయింగ్ మిషన్లను, టార్పాలిన్లను, తైవాన్ టార్పాలిన్లను, బేటరీ స్ప్రేయర్లను ఐ.డబ్ల్యు.ఎం.పి వాటర్ షెడ్ ప్రోజెక్ క్రింద సరఫరా చేశారు.

అనంతరం జియ్యమ్మ వలస మండలం రావాడ గ్రామంలో ఆర్ ఓ ఎఫ్ ఆర్ క్రింద ప్రతిపాదించిన భూముల రికార్డులను తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టుపై పిడుగుపడి ఆవులు, మేకలు మృతి

విశాలాంధ్ర-కురుపాం: గుమ్మ లక్ష్మీపురం మండలం బాలేసు పంచాయితీ బయ్యాడ గ్రామంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి ఆవులు మేకలు మృతి చెందాయి .ఈరోజు ఏజెన్సీలో కురిసిన వర్షానికి పెద్ద ఎత్తున పిడుగులు పడడంతో బయ్యాడ గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు విషయం తెలుసుకుని ఎల్విన్ పేట పోలీసు వారు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.అలాగే కురుపాం లో పలు చోట్ల చెట్లు పడి ద్విచక్ర వాహనాల ధ్వంసం కాగా విద్యుత్ వైర్లు నేలకొరిగాయి.

ఆటోని ఢీకొన్న కారు : ఆరుగురికి గాయాలు

-ఎయిర్ బెలూన్లతో బయటపడ్డ కారు డ్రైవర్, యజమాని
- కంచెకర్రలతో ప్రాణాలు దక్కించుకున్న ఆటో ప్రయాణికులు
- పెద్దప్రమాదం నుండి బయటపడ్డ క్షతగాత్రులు

విశాలాంధ్ర -సీతానగరం/ బెలగాం: మండలం లోని చినభోగిలి గ్రామం వద్ద రాష్ట్రీయ ప్రధాన రహదారిపై టైరు పంచరైనకారు అతివేగంగా వస్తూ ఆటోని ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన తీరు చూస్తే పెద్ద ప్రమాదం జరిగి ఉంటుందన్న అనుమానం కలగక మానదు. కానీ స్థానికుల చొరవ, కారు డ్రైవర్, యజమాని షీట్ బెల్టు పెట్టుకొని ప్రయాణం చేయడం, ప్రమాదానికి గురైన ఆటో పల్టీ కొట్టకుండా అడ్డుకున్న రైల్వేగుత్తేదారు రోడ్డుపక్కన కర్రలతో ఏర్పాట్లు చేసిన కంచె వంటి వాటివల్ల ప్రయోజనం కలిగిందని స్పష్టంగా కనిపిస్తుంది. వివరాల్లోకి వెళితే... విశాఖ నుండి కొమరాడ వైపు అతి వేగంతో వస్తున్నకారు ఒక్కసారి ముందున్న కుడివైపు టైర్ పంక్చర్ కావడంతో జోగమ్మపేట నుండి బొబ్బిలి వైపు వెళ్తున్న ప్రయాణికుల ఆటోని బలంగా ఢీకొట్టొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. ఆటో కూడా బోల్తాపడగా దాని ముందు భాగం కొంత దెబ్బతింది. జరిగిన సంఘటన చూస్తే కారులో ముందుఉన్న డ్రైవర్, ఓనర్ మృతి చెందిఉంటారని భావిస్తారు. కానీ నేటి సాంకేతిక పరిజ్ఞానంతో వారిద్దరు రోడ్డు నియమాలు పాటించడం వల్ల రెండు ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో వారిద్దరికీ చిన్న గాయాలు కూడా తగలలేదు. దీంతో పాటు అతివేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొనగా ఆటో పలు పల్టీలు కొట్టి దానిలో అంతా మృతిచెందే పరిస్తితి ఉన్నప్పటికీ ఇటీవల అక్కడ రైల్వేలైన్ పనులు జరుగుతుండటంతో రోడ్డు ప్రక్కన వారు వేసిన కర్రల కంచె ఆటో తిరగబడ కుండా కాపడాయి. సీతానగరం పోలీసులు ప్రసాద్, రామకృష్ణ, యుగంధర్ లు సంఘటన స్థలానికి చేరుకుని క్షత గాత్రులను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించే చర్యలు తీసుకు న్నారు. నిలిచిన వాహనాలు రాకపోకలను పునరుద్ధరణ చేశారు. కారు, ఆటోలను పోలీస్ స్టేషన్ కు ట్రాక్టర్, జెసిబి సహాయంతో తరలించారు.

ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అరుగురికి గాయాలు

కారు ఆటోను ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపారు. సీతానగరం మండలం జోగింపేట గ్రామానికి చెందిన సోంబారికి లక్ష్మి కూలిపని చేసుకొంటుంది. ఆదివారం ఉదయం తనభర్త కిరణ్ తో కలసి ఆటోలో కాశీపేట వెళ్తుండగా మార్గమధ్యలో కొంతమంది ఆటో ఎక్కారు. చినబోగిలి ఎస్సీకాలనీ దగ్గర మెయిన్ రోడ్ పై ఆటోను ఎదురుగా పార్వతీపురం వైపు అతివేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఆటో రోడ్డుపై బోల్తా పడింది. ఈప్రమాదంలో లక్ష్మికి, ఆమె భర్త కిరణ్ కు, ఆటోలో ప్రయాణిస్తున్న గెద్దలుప్పి గ్రామానికి చెందిన అల్లుచిన్నారావు, బొంగులసంజీవినాయుడుకు,విజయనగరం జిల్లా సారిక గ్రామానికి చెందిన కారు డ్రైవరు సువ్వాడ సందీప్ కుమార్, కారులో ప్రయాణిస్తున్న బి. ఇందిరకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వారికి జిల్లా వైద్యులు చికిత్సఅందిస్తున్నట్లు తెలిపారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. ఈరోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణం చేస్తున్న మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గులిపల్లి సుదర్శనరావుకు ఎటువంటి గాయాలు తగలకుండా బయట పడ్డారు. అతని భార్య ఇందిరకు చిన్న చిన్న గాయాలు తగిలాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ. ఎస్ఐ లంక శ్రీనివాసరావు తెలిపారు.

జేసీ ను కలిసిన జిసిసి డివిజనల్ మేనేజర్

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గా కొత్తగా జాయిన్ అయిన ఆర్ గోవిందరావును పార్వతీపురం గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు గూర్చి తెలియజేశారు.

గోచక్కను సందర్శించిన జన సైనికులు

విశాలాంధ్ర-పార్వతీపురం: మండలంలోని గోచక్క గ్రామాన్ని జనసైనికులు, వీర మహిళలు ఆదివారం సందర్శన చేశారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసు కున్నారు. సమస్యలను జనసేననాయకులు పరిష్కారం చేస్తామని వారికి చెప్పారు. రానున్న సాధారణ ఎన్నికలలో జనసేనకు మద్దతు ఇవ్వాలని కోరారు.జనసేనకు ప్రజలు ఇస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామంలో రామ మందిర నిర్మాణం కోసం కొంత విరాళంను కూడా అందజేసారు. ఈకార్యక్రమంలోజనసేన నియోజక వర్గ నాయకులు అక్కివరపు మోహనరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షురాలు ఆగూరు మణి, సీతానగరం మండల నాయకులు రమేష్, జిల్లా నాయకులు ఖాతా విశ్వేశ్వరరావు, చిట్లు గణేశ్వరరావు, కర్రి మణికంఠ, అన్న బత్తుల దుర్గాప్రసాద్, చంద్రశేఖరరావు, గోచక్క పంచాయతీ జనసేన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం ని మర్యాద పూర్వకంగా కలిసిన సాలూరు నూతన తహశీల్దార్ బాలమురళీకృష్ణ

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : ఇటీవలే జరిగిన తహశీల్దార్ల బదిలీల లో బాడంగి మండలం నుంచి సాలూరు మండలానికి వచ్చిన నూతన తహసీల్దార్ బాల మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈరోజు అంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖా మాత్యులు పీడిక రాజన్నదొర ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను బహుకరించారు.అనంతరం కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర ను పరామర్శిస్తూ వారి ఆరోగ్య క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

నియోజకవర్గంలో విస్తృతంగా జనసేన కార్యక్రమాలు : మోహనరావు

విశాలాంధ్ర-పార్వతీపురం: రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా జనసేన రాష్ట్ర పార్టీ అదేశాలు, సూచనలు సలహాల మేరకు నియోజక వర్గంలోని మూడు మండలాల్లో విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని జనసేన నియోజక వర్గ నాయకులు అక్కివరపు మోహనరావు తెలిపారు.ఆదివారం ఆయన పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడారు. జనసేన రాష్ట్రఅధ్యక్షుడు పవన్ కళ్యాణ్, నాగబాబు, నాదెండ్ల మనోహర్ల ఆదేశాలను పాటిస్తూ నియోజక వర్గంలో పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకొంటూ వాటిని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మూడు మండలాల పరిధిలోని జనసేన నాయకులు, జనసేన సైనికులు, వీర మహిళలు సహకారంతో కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని చెప్పారు. ఆయనతోపాటు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి కై వంగర మండల ప్రజల పాట్లు

- అంతంత మాత్రంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- మడ్డువలస రెగ్యులేటర్ పనులు పూర్తియ్యేదెప్పుడు...
- ప్రాజెక్టు నేటితో నిండేదెప్పుడు?
-ఈ గ్రామాలకు పూర్తిస్థాయి మంచి నీటి సరఫరా అందేనా?

విశాలాంధ్ర-వంగర: ఒకవైపు మండుతున్న ఎండలు... మరోవైపు వంగర మండల ప్రజలు మంచి నీరు దొరక్క అల్లాడిపోతున్నారు. ఉన్న మంచి పథకం ద్వారా వచ్చే నీరు సరఫరా నిలిచిపోవటం... ప్రత్యామ్నాయంగా తీసిన బోర్లు వల్ల గ్రామాలకు నీరు పూర్తి స్థాయిలో అందకపోవటంతో మంచి నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట మగ్గూరు వద్ద నున్నటువంటి మంచిపథకం నుండి మంచి నీటి సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మడ్డువలస ప్రాజెక్టు లో నీరు నిండా ఉంటే తప్ప,ఈ మంచి నీటి పథకం నుంచి 24 గ్రామాలకు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. గత నెల దినాలుగా మడ్డువలస డ్యాం లో ఉన్నటువంటినీటినంతటినీ,మడ్డువలస ప్రాజెక్టులో ప్రధాన రెగ్యులేటర్ తలుపులు, సీళ్లు, రోప్పు తదితర పనులు చేసే నిమిత్తం మని,డ్యాం లో నీటినంతటినీ గేట్లు ద్వారా,కాల్వలు నుండి బయటకు విడచి పెట్టిన విషయం విధితమే. దీంతో మంచి నీటి పథకం నుంచి మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే.నీరు ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, మండలంలో నాలుగు గ్రామాలు వద్ద మంచి నీటి ఎద్దిడి నివారణకు అర్ డ బ్లూ ఎస్ అధికారులు మెట్ట మాగ్గూరు, శివ్వాం, ఋషింగి, కొప్పర వలస, గ్రామాల్లో మంచినీటి బోర్లు ద్వారా గ్రామాలకు నీరు అందించాలని తవ్వించినప్పటికీ, ఆ బోర్లు కు సరియైన మోటార్లు అమర్చక పోవటంతో కనీసం ఆయా గ్రామాల్లో కూడా అన్ని ఇల్లకు నీరందించలేని దుస్థితి తో మంచినీటి కోసం గ్రామాల్లో ప్రజలు స్వంతంగా మంచి నీటి బోర్లు వేసుకోవలసిన పరిస్థితి రావటంతో ప్రజలు మంచి నీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ముఖ్యంగా మెట్ట మగ్గూరు గ్రామం వద్ద ను తీసిన బోరుతో మెట్ట మగ్గూరు గ్రామం లో కనీసం ఉన్నటువంటి 1000 మంది జనాభాలో కనీసం వంద మంది ప్రజలకు అయిననూ, మంచినీరు అందించలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఉన్నటు పది కులాయిలకు మంచి నీరు అందించలేకపోవటం వల్ల ప్రజలు ఎన్నో భాధలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న మొత్తం మంచి నీటి బావులు పూర్తిగా ఎండిపోయాయి అలాగే బోర్లు సగానికి పైగా పాడైపోయాయి. వాటిని మరమ్మతులు చేపట్టకపోవటం, నూతులు పూర్తిగా ఎందిపోవటమేకాకుండా, మంచినీటి పథకం వల్ల నీరు సరఫరా కాకపోవటం, కొత్తగా నీరందించటానికి కొత్తగా తవ్విన బోరువల్ల నీరందక పోవటం తోప్రజలు మంచినీటి కోసం అష్ట,కష్టాలు పడు తున్నారు.మంచినీటి ఇబ్బందులకు మడ్డువలస డ్యాం నీటి తో నిండితే తప్ప మండలంలో గల ఈ గ్రామంతో సహా 24 గ్రామాలు ప్రజలు తాగునీటి కష్టాలు తీరవన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మడ్డువలస రెగ్యులేటర్ పనులు పూర్తియ్యేదెప్పుడో,ప్రాజెక్టు నేటితో నిండేదెప్పుడు? ఈ గ్రామాలకు మంచి నీరు సరఫరా పూర్తి స్థాయిలో అందేదెప్పుడోవేచిచూడాల్సిందే.

మెళకువలు పాటిస్తే చెరకు పంట సాగు లాభదాయకం

చెరకు పంట సాగు, సస్యరక్షణ పద్ధతులపై ఎస్.కోట మండల వ్యవసాయాధికారి రవీంద్ర

గౌరీపురం వద్ద మొక్క చెరకు సాగు చేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మెలకువలు పాటిస్తే చెరకు పంట సాగు లాభదాయకం. చెరకు పంట సాగును ఎక్కువ సూర్యరశ్మి, వర్షపాతం, గాలిలో తేమ హెచ్చుగా ఉన్నప్పుడు చెరకు ఏపుగా పెరుగుతుంది. రాత్రి కన్నా పగటి వేళలు అధికంగా ఉండే జూన్-జులై నెలలు పెరుగుదలకు అనుకూలం. గాలిలో తేమ, చల్లటి పొడి వాతావరణం ఉంటే రసంలో పంచదార పెరుగుదలకు అనుకూలం. గరిష్ట మరియు కనిష్ఠ ఉష్ణోగ్రతలకు మధ్య హెచ్చు వ్యత్యాసం (నవంబరు నుండి మొదలవుతుంది) ఉంటే పంచదార శాతం అధికమవుతుంది. చెరకు పంట సాగు. సస్యరక్షణ పద్ధతులపై ఎస్.కోట మండల వ్యవసాయాధికారి రవీంద్ర వివరించారు.

- నీటి పారుదల క్రింద చెరకు సాగుకు అనువైన విత్తన రకాలు...

కో6907, 81ఎ125, 84ఎ261, 86వి96, 83ఆర్23, 87ఎ298, 97ఎ85, 2003వి46, 2002వి48, 2000వి59, 91వి83 93ఎ145, కో.ఎ 7602, కో.టి8201, కో7805, 83వి15, కో7219, కో.ఆర్ 8001, కో 7706, 2001ఎ63.

- జూన్ నెలలో నాటటానికి అనువైన రకాలు..

కో6907, కో.టి8201, 85ఎ261 81ఎ99, 81వి48 84ఎ125, 83ఎ30, 90ఎ272, 83ఆర్23, 87ఎ298, 93ఎ145, 97ఎ85. 2001ఎ63.

- చౌడు భూముల్లో సాగుకు అనువైన రకాలు..

81ఎ99, 81వి48, 2000వి59, 99వి30, కో7219, కో.టి 8201, 93ఎ145.

- సాగుకు అనువైన నేలలు..

నీటి సదుపాయం ఉన్న మెరక భూములు చాలా అనుకూలమైనవి. తేమను, పోషకాలను ఎక్కువగా నిలుపుకోలేని తేలిక నేలలను (ఇసుక నేలలు) సేంద్రీయ పదార్థాలు (ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు లేక 5 టన్నుల ఫిల్టర్ మడ్డి) వేసి అభివృద్ధి పరచి చెరుకు విత్తనం నాటుకోవాలి. సారహీనమైన, లోతు తక్కువ కలిగి నేల పైపొర గట్టిపడే భూములనులోతైన దుక్కిచేసి ఎకరాకు 1టన్ను పొడిగా వేరుశనగా తొక్కలను లేక వరి ఊక వేసి పరుచుకోవాలి. పాలు చౌడు భూముల్లో వెరకు నాటేటప్పుడు, ముందుగా లవణాలను మురుగునీటి కాల్వల ద్వారా తీసివేయాలి. లవణ పరిమితి నేల లోగో సెంటీమీటరుకు 2 మిలీ మోస్లకన్నా ఎక్కువ ఉండకూడదు. క్షార భూములకు జిప్సమ్ వేసి అభివృద్ధి పరచి నాటుకోవాలి.

- నేలలు దుక్కి విధానం, ప్రధమ కృషి..

నేలను 25-30 సెం.మీ. లోతు వరకు ఇనుప నాగలితో దున్ని మెత్తటి దుక్కి చేయాలి.. 4-6 వారాలకు ముందు ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు లేక 5 టన్నుల ఫిల్టర్డ్ మడ్డి వేసి కలియదున్నాలి. చదును చేసిన తర్వాత కాలువలను. బోదెలను రిడ్జ్ మార్ లేదా రెక్కల నాగలితో వేసుకోవాలి. కాలువ వెడల్పు 30 సెం.మీ. లోతు 20 సెం.మీ. ఉండాలి. చాళ్ల మధ్య స్వల్పకాలిక రకాలకు 80 సెం.మీ.. మధ్య కాలిక రకాలకు 90 సెం.మీ., ఆలస్యంగా వర్షాధారంగా నాటే చెరకుకు 60 సెం.మీ. ఎడం ఉండాలి. నీటి ముంపుకు గురయ్యే నల్లరేగడి మరియు ఓంద్రు నేలల్లో వరకు నాటటానికి ముందే ప్రతి 24 మీటర్ల దూరానికి 60 సెం.మీ. వెడల్పు, 40 సెం.మీ. లోతు గల మురుగునీటి కాల్వలను తీసుకోవాలి. లోతైన కాల్వలో చెరకు నాటితే పీక పురుగు, కలుపు ఉధృతి తగ్గడంతో పాటు సాగునీటిని కూడా ఆదా చేయవచ్చు.

తుఫాను గాలులకు తోటలు పడిపోవు.

- కలుపు నివారణ, అంతరకృషి...

ముచ్చెలు నాటిన వెంటనే లేదా 3వ రోజున అట్రజిన్ 50శాతం పొడి మందును ఎకరానికి 2 కిలోలు లేదా మెట్రిబుజిన్ 600 గ్రాములు 450 లీటర్ల కలిపి పిచికారీ చేసి ఒక నెల వరకు కలుపు నివారించుకోవచ్చు. తోట నాటిన నెల తరువాత 20, 25 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి 2, 3 సార్లు గొర్రుతో లేదా దంతితో అంతరకృషి చేయాలి. లేదా కూలీలలతో కలుపు తీయించాలి. వెడల్పాటి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు 2-4డి. సోడియం సాల్ట్ 80% పొడి 1800 గ్రాములు మరియు గ్రామోక్సోన్ 24% ఒక లీటరు ఒక ఎకరాకు 450 లీటర్ల నీటిలో కలిపి వరుసల మధ్య మాత్రమే పైరుపై పడకుండా నాటిన 20, 60 రోజులప్పుడు పిచికారీ చేయాలి. ఈ మిశ్రమం స్ప్రే చేస్తున్నప్పుడు మందు పైరుపై పడితే పంటకు నష్టం జరుగుతుంది.

చెరకు విత్తనాలు వేస్తున్న దృశ్యం

ఘనంగా ఏరువాక పూర్ణిమ

ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-కురుపాం: కురుపాం నియోజకవర్గ ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు .కేంద్ర పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కురుపాం నియోజకవర్గ హెడ్ క్వార్టర్ లో స్థానిక రైతులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులందరికీ ఏరువాక శుభాకాంక్షలు తెలియజేస్తూ గతములో చంద్రబాబు పరిపాలనలో వ్యవసాయాన్ని పండుగల చేయడం జరి గిందనీ, వ్యవసాయ రంగా సగటున 11% వృద్ధిరేటు సాధించడం జరిగిందన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి కృష్ణ నదులు అనుసంధానం చేశారు కానీ ఈ ప్రభుత్వం ఈ కార్యక్రమ వచ్చాక రైతు భరోసా అంటూ రైతును దగా చేశారు జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూలిపోయారు చంద్రన్న ప్రభుత్వంలో చిన్న సన్నకారు రైతులకు 90 శాతం ఎస్సీలకు 100%శాతం డ్రిప్పు మరియు లింకర్లను రద్దుచేసి వాణిజ్య వాణిజ్య పంటల రైతులకు జగన్ రెడ్డి ద్రోహం చేశారు ఈ కార్యక్రమానికి నియోజవర్గం నుండి పలువురు టీడీపీ నాయకులు అరుగు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోట వెంకట నాయుడు , రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు కోల రంజిత్ కురుష్మాం మండల కన్వీనర్ కెవి కొండయ్య గారు అరుకు పార్లమెంట్ అధికారులు అరకు పార్లమెంటల్ అధికార ప్రతినిధి దొంక రామకృష్ణ గారు అరకు కురుపాం నియోజకవర్గ రైతు అధ్యక్షులు గురైన శ్రీ మూర్తి గారు అరకు పార్లమెంటరీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కొత్తకోట విశ్వనాథ్ గారు అరకు పార్లమెంటు ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కృష్ణ బాబు గారు జియం వలస మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కర్రీ రాజేంద్ర నాయుడు మరియు సర్పంచులు మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు మరియు ఐదు మండలాల తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

ఘనంగా ఏరువాక పౌర్ణమి దినోత్సవం

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రైతులందరు ఏరువాక పౌర్ణమి దినోత్సవం తెలుగుదేశం పార్టీ నాయకులు తో కలిసి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం టీడీపీ తోనే సాధ్యం అని ఏరువాక పౌర్ణమి అంటే రైతులకు అతి పెద్ద పండగ అని తొలకరి ఆసన్నమయ్యే సమయం లో దున్నడానికి సిద్ధంగా ఉన్న పంట పొలాన్ని శుద్ధి చేసుకొని సేద్యం మొదలు పెట్టె ఉత్సవమే ఏరువాక అని రాష్ట్రంలో జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని,నేడు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక. రైతు భరోసా, పంట నష్టం పరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోలు, రైతులకు యంత్ర పరికరాల పంపిణీలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని,4.3 వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరికరణ నిధి,4వేల కోట్ల రూపాయలతో ప్రకృతి విపత్తుల నిధి ఏర్పాటు చేస్తామంటూ రైతులకు మోసం చేశారు అని,ఆర్.బి.కె ల పేరుతో ఆర్భాటమే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదని దీంతో వ్యవసాయం గిట్టుబాటు కాక క్రాప్ హాలిడేలు ప్రకటిస్తున్నారని ,జగన్ వచ్చిన తర్వాత తెలుగుదేశం హయంలో పథకాలకి కొన్నింటికి పేర్లు మార్చి అన్నదాతలను ఆదుకునేందుకు చంద్రన్న అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేశారని,చంద్రన్న పాలనలో వ్యవసాయ రంగంలో సగటున 11 శాతం వృద్ధి రేటు సాధించడం జరిగిందని. పట్టిసీమ ద్వారా గోదావరి-కృష్ణ నదుల అనుసంధానం చేశారని, ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ 13,500 చొప్పున ఐదేళ్లలో రూ 67,500 ఇస్తామని హామీ ఇచ్చి రూ 37,500 మాత్రమే చెల్లిస్తున్నారని.ఒక్కొక్క రైతుకు 30 వేలు నష్టం వాటిల్లుతుందని,చంద్రన్న రైతు రథం ద్వారా 23881 ట్రాక్టర్లు ఇవ్వగా జగన్ రెడ్డి ఇచ్చింది కేవలం 6,300 మాత్రమేనని,జగన్ రెడ్డి పాలనలో 9 తుఫాన్లలో సుమారు 50 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే అరకొరగా పరిహారం చెల్లించారని ఆన్నారు.ఈ కార్యక్రమం లో టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరి రావు,టెక్కలి నియోజకవర్గ రైతు కమిటీ అధ్యక్షులు అట్టాడ రవిప్రసాద్,మామిడి రాము, టెక్కలి మండల రైతు కమిటీ అధ్యక్షులు పోలాకి షణ్ముఖ రావు,నందిగాం మండల రైతు కమిటీ అధ్యక్షులు గంతగోరు పున్నయ్య,ఇప్పిలి జగదీష్, లైశెట్టి దుర్గారావు, కెల్లి శ్రీరాములు, చల్ల అప్పన్న, బొడ్డేపల్లి లచ్చు, గండేటి భీమారావు, గేదిల సంజీవ్ రెడ్డి, జానపాన తేజ, సతివాడ లచుమయ్య, జన్ని ధర్మారావు, బెపల చంద్ర రావు, ఎఱ్ఱన్న రెడ్డి, సనపల సూర్య రావు, నాగరాజు, అట్టాడ కృష్ణారావు, పోలాకి కృష్ణమూర్తి, ధవల రామారావు, బమ్మిడి కుసుమరావు, బమ్మిడి ధర్మారావు,ధవల అప్పలస్వామి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్ని కాయిట్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టు ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 16 నుండి తమిళనాడు రాష్ట్రం లో చెన్నైలో జరగబోయే సౌత్ ఇండియా టెన్ని కాయిట్ పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపిక కస్పా స్కూల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి క్రీడాకారులు స్త్రీ పురుషులు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ నడిపిన శ్రీనివాస్ రావు ఎక్స్ ఎమ్స్ చైర్మన్ , అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు అలాగే రాష్ట్ర తేన్ని కాయట్ కోశాధికారి తవిటయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా వారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ సౌత్ ఇండియా టెన్నికాయిడ్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులంతా ఉన్నత విజయాలు సాధించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ శ్రీను శివ తిరుపతిరావు హాజరయ్యారు ఆంధ్రప్రదేశ్ నుండి పురుషులు జట్టు స్త్రీల జట్టు ఎంపిక చేయడం జరిగింది వీరికి కోచింగ్ క్యాంప్ నిర్వహించి ఈ జట్లను త్వరలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొన్నారు అని తెలిపారు

రెడ్డివీధి శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలి : జనసేన జిల్లా నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మున్సిపాలిటీలోని రెడ్డివీధి శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా నాయకులు చందక అనిల్ కుమార్, వంగల దాలి నాయుడు, నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీ శంకర్ తదితరులు రెడ్డి వీధి చివరన ఉన్న స్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డివీధి చివరలో ఉన్న స్మశాన వాటికను మున్సిపాలిటీలోని 24, 25, 26 వార్డులకు చెందిన ప్రజలు ఉపయోగిస్తున్నారన్నారు. స్మశాన వాటికి రాకపోకలు సాగించేందుకు రహదారి సదుపాయం లేక అవస్థలు పడుతున్నారని, అలాగే స్మశాన వాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిలో భాగంగా బర్నింగ్ షెడ్, వెయిటింగ్ షెడ్, వాటర్ సదుపాయం రాకపోకలు సాగించేందుకు రహదారి, ప్రహరీ గోడ, మెయిన్ గేట్ తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో సంబంధిత అధికారులకు, పాలకులకు విషయాన్ని తెలియజేసిన ఫలితం లేదన్నారు. తక్షణమే రెడ్డివీధి చివరన ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు.

ఒడిస్సా రైల్ ప్రమాద మృతులకు.. విజయనగరం ప్రెస్ క్లబ్ అశ్రు నివాళి..

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఓడిశాలోని బాలాసోర్ లో శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన ఆత్మలకు నివాళులర్పిస్తూ విజయనగరం ప్రెస్ క్లబ్ ఆదివారం సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించింది. అంబటి సత్రం కూడలి వద్దనున్న ప్రెస్ క్లబ్ భవనం నుంచి మూడు లాంతర్లు మీదుగా కోట కూడలి వరకు శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ విద్యార్థిని విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, డిబిఎస్ యూ ప్రతినిధులతో కలిసి నగర జర్నలిస్టులు మౌన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కోట కూడలి వద్ద క్యాండీల్స్ వెలుగించి, కొద్దీ సేపు మౌనం పాటిస్తూ మృతుల ఆత్మలకు అశ్రు నివాళులర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు ఎలిశెట్టి సురేష్ మాట్లాడుతూ దేశంలోనే ఇదొక దురదృష్టకరమైన ప్రమాదమని అన్నారు. క్షతగాత్రులను ఆదుకోవాలని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వంపై రైల్వే రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ ఘటన పై నిష్పక్షపాత విచారణ జరగాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎంఎంఎల్ నాయుడు, పిఎస్ఎస్ వి ప్రసాద్, సిహెచ్ జైరాజ్, రమేష్ నాయుడు, బోను శ్రీనివాసరావు, జి శివ ప్రసాద్, బి డేవిడ్ రాజు, ప్రతాప్, ఆర్ ఈశ్వర్ రావు, బి సుధీర్, మధు రెడ్డి, దాలిరాజు, కే ఉమామహేశ్వరరావు, పరశురాం, భాను, కామేశ్వర రావు, సూర్య పాత్రో, శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పొట్టా శ్రీనివాసరావు, డిబిఎస్ యూ స్టేట్ సెక్రెటరీ పి చిట్టిబాబు, ప్రతినిధి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మత ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారు

విశాలాంధ్ర-పలాస: దేశంలో కేంద్ర ప్రభుత్వం రామాలయం, కాశీ, మధుర పేర్లతో మత ఉన్మాదాన్ని సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని భరత్ బచావో జిల్లా కన్వీనరు పి.పరమేశ్వరరావు అన్నారు. కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత్ బచావో కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో సంఘ పరివార్ పాసిస్టు శక్తులు దేశ ప్రజలను తీవ్ర కష్టాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులు, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీల పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అరుణ, నాగమణి, వంకల మాధవరావు, తామాడ తిలోచన, కోదండం, దాసరి శ్రీరాములు, పుచ్చ దుర్యోదన, కోత ధర్మారావు, చాపర వేణు, కొనారి మోహన్, బోనెల గోపాల్, బి.దుర్యోదన, పద్మలోచన, బి.ప్రభాకరరావు, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర సహిత వారాహి అమ్మవారి చక్కర తీర్థ స్నానాలు

విశాలాంధ్ర -జలుమూరు: వంశధార నది తీరంలో శ్రీముఖ లింగేశ్వర సహిత వారాహి అమ్మవారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆదివారం చక్ర తీర్థ స్థానాలు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను మధుకేశ్వరాలయం నుండి నదీ తీరం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు సహస్రనామార్చన పండిత పరిషత్ అభిషేకాలు కుంకుమ పూజలు నిర్వహించారు తదుపరి చక్ర తీర్థ స్నానాలు నిర్వహించారు.

రణస్థలంలో 28వ రోజు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-రణస్థలం : శాఖ గ్రంథాలయం రణస్థలంలో ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా 28వ రోజు ముందుగా దినపత్రికల పఠనం, కథలను రాయించడం చదివించడం జరిగింది. టీ.సత్యం గణితంలో బాద్మాష్ రూల్ (కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగా హారాలు) గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. తదనంతరం విద్యా ర్థులు చెస్, క్యారమ్స్, బిజినెస్ గేమ్, పోటీల్లో పాల్గొన్నారు.

వృధాగా అధునాతన భవనం.. ఉపయోగిస్తే ప్రయోజనం

హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తే మంచిదంటున్న స్థానికులు

ధర్మవరంలో ఎత్తేసిన సాంఘీక సంక్షేమ శాఖ వసతిగృహం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం మేజరు పంచాయతీలో సుమారు రూ. 50లక్షల వ్యయంతో నిర్మించిన సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని అనతికాలంలోనే గత తెలుగుదేశం ప్రభుత్వం ఎత్తేసింది. కేవలం మూడేళ్లకే అధునాతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని వృధాగా వదిలేయటం వలన హాస్టల్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్లు, ఇతర సామాగ్రి దొంగల పాలవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అధునాతన భవనాన్ని వృధాగా వదిలేసే కన్నా ప్రజలకు ఉపయోగపడే హెల్త్ సబ్ సెంటర్ కైనా లేదా స్థానిక ఎస్సీలకు కమ్యూనిటీ భవనంగా వినియోగించుకునేందుకు గానీ అప్పగించాలని కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు మండలస్థాయి అధికారులతో కలిసి వృధాగా వదిలేసిన అధునాతన వసతిగృహాన్ని పరిశీలించి ప్రజలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని కేటాయించాలని ధర్మవరం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీ వసతిగృహంలోని విశాలమైన గదులు

వృద్దులకు, ఒంటరి మహిళలకు నిత్యవసర వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర-జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో ఉన్న హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతీ నెలా గ్రామంలో వృద్దులకు, ఒంటరి మహిళలకు నెలవారీ నిత్యవసర సరుకులను ఉచితంగా అందజేస్తోంది. అందులో భాగంగా ఈనెల సరుకులను ఆదివారం అందజేసారు. గ్రామంలోని ఉద్యోగులైన యువత ఆద్వర్యంలో ఈసేవా సంస్థ పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిరుపేదలైన కుటుంబాలకు మేమున్నామని ఈ సేవాసంస్థ ఇస్తున్న భరోసా పట్ల గ్రామంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే రైతులకు ధాన్యం రవాణా, కళాసీచార్జీలు

మాజీ జెడ్పిటిసి బండారుపెదబాబు

విశాలాంధ్ర-జామి: ప్రభుత్వ నిభందనల మేరకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం సరఫరా చేసిన రైతులకు త్వరలోనే రవాణా చార్జీలు, కళాసీ కూలీ నగదు అందుతుందని మాజీ జెడ్పిటిసి బండారు పెదబాబు తెలిపారు. రైతులకు రావాల్సిన రవాణా చార్జీలకు తనతోపాటు పలువురు రైతులు జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై ప్రత్యేక కమిటీ విచారణ చేసిందని, ఈమేరకు త్వరలో రైతులకు నగదు అందుతుందని తెలిపారు. రైతుల సమస్యలపై తాము పోరాడుతున్నామని, వారికి అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.

మానవతా వాదులంతా హాజరుకావాలి...



విశాలాంధ్ర-చీపురుపల్లి : ఒరిస్సా రాష్ట్రంలో మొన్న బాలాసూర్ జిల్లా బాల్ నాగ్ రైల్వేస్టేషన్ దగ్గర జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన మన సోదర, సోదరీ మనులకు సంతాపం తెలియ జేయుట కోసం అర్ధరాత్రి ఒక పిలుపుతో ఆ ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు రక్తదానం చేసిన మానవతావాదులకు జోహార్లు తెలియజేస్తూ సోమవారం రైల్వేస్టేషన్ దరి (పెద్ద వృక్షం) దగ్గరకు మానవతా వాదులంతా 6:30 కు హాజరుకావాలని మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ, ఆశయ ట్రస్ట్, చీపురుపల్లి వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

దళిత సమ్మేళనంకు పాలకొండ దళిత యువకులు పయనం

విశాలాంధ్ర-పాలకొండ: విశాఖపట్నంలో ఆదివారం జరుగుతున్న దళిత యువ సమ్మేళనంకు పాలకొండ డివిజన్ నుంచి ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం అధ్యక్షులు మరియు మన్యం జిల్లా అధ్యక్షులు, యువ నాయకుడు బత్తిన మోహన్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది దళిత యువకులు విశాఖకు పయనమయ్యారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ దళిత యువకులకు సంబంధించి దళిత నాయకులు దిశ, నిర్దేశం, చేయనున్నట్లు తెలిపారు.

దోమల నివారణకు అన్ని చర్యలు : సర్పంచ్ ఉయ్యాల

విశాలాంధ్ర-తెర్లాం: బాడంగి:బాడంగి మండలం ఆకులకట్ట లో దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకున్నామని సర్పంచ్ ఉయ్యాల సత్యన్నారా యణ ఆదివారం విలేకర్ తో తెలిపారు. గ్రామం పరిశుభ్రం గా ఉంచాలనే ఉద్దేశం తో సంగ్రామ సర్పంచ్ గ్రీన్ అంబాసిడర్ ల తో దగ్గరుండి బ్లీచింగ్ జల్లిస్తూ , దోమలు ,ఈగలు ప్రజలు మీద పడకుండా గ్రామం పరిశుభ్రం గా ఉంచాలనే ఉద్దేశం తో ఎప్పటికప్పుడు పరిశుద్ధ పనులు నిర్వహిస్తున్నామని ఆకులకట్ట గ్రామ సర్పంచ్ తెలిపారు.

విశాలాంధ్ర
సోమవారం 5, జూన్, 2023

జోగుంపేట గ్రామానికి

జాతీయ స్వచ్ఛ పురస్కారం

నేడు ఢిల్లీలో పచ్చదనం – పరిశుభ్రత అవార్డు అందుకోనున్న జోగమ్మపేట సర్పంచ్

అధికారుల నుండి సహకారం లేక సొంత డబ్బులతో బయలుదేరిన సర్పంచ్, కార్యదర్శి, గ్రామ యువకులు

కె.సింహాచలం సర్పంచ్, జోగుంపేట

విశాలాంధ్ర – సీతానగరం/పార్వతీపురం: జాతీయ అవార్డుకు పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలంలోని జోగింపేట గ్రామ పంచాయతీ ఎంపికయినట్లు పర్యావరణ, అటవీశాఖ మంత్రిత్వ శాఖ నుండి జిల్లాకు ఇప్పటికే సమాచారం రాగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగే వేడుకల్లో అవార్డు అందుకోవడానికి ఈ పంచాయతీకి చెందిన సర్పంచ్ కల్యంపూడి సింహాచలం, సెక్రటరీ టి.కిరణ్, సుబ్బమ్మ పేరంటాల యువజన సంఘంకు చెందిన కళ్యంపూడి సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, చందాన సింహాచలంలు ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు. పచ్చదనం, పరిశుభ్రత (క్లీన్ అండ్ గ్రీన్) విభాగంలో మన రాష్ట్రంలోని మూడు పంచాయతీలను (ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బిల్లనందూరు, నెల్లూరు జిల్లాలోని కడలూరు, పార్వతీపురం మన్యం జిల్లాలోని జోగింపేట పంచాయతీలను) కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. జోగింపేట గ్రామంలో శతశాతం బహిరంగ మలవిసర్జనలేని పంచాయతీగా, తాగునీటి సరఫరా, పచ్చదన గ్రామం, మురుగు నీరు పారుదల – పారిశుధ్యం, పౌష్టికాహారం విధానాలు పాటించడం, సుపరిపాలన, వీధిదీపాలు ఏర్పాటు, గ్రామ పరిధిలో 540 మొక్కలు నాటి పచ్చదనం కల్పించడంతో పాటు, ఆహ్లాదకర వాతావరణం తీసుకురావడంలో ఈ అవార్డుకు ఎంపికైంది. గ్రామంలో ప్రజలందరి సమష్టి కృషితోపాటు సుబ్బమ్మ పేరంటాల తల్లి ఆశీస్సులు, సుబ్బమ్మతల్లి పేరంటాల సేవా సంఘం సభ్యుల నిరంతర కృషి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల సహకారంతో వచ్చిందన్నారు. జాతీయ అవార్డుకు జిల్లాలోని జోగింపేట ఎంపికపట్ల తమకు ఎంతో సంతోషం కలిగిందని, ఇప్పటికే గత నెలలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కూడా అవార్డు తీసుకున్నట్లు సర్పంచ్ సింహాచలం తెలిపారు. జాతీయ స్థాయిలో తమ గ్రామానికి అవార్డు ప్రకటనలో తమ సేవా సంఘం కృషి కూడా ఎంతో ఉన్నందున ఎస్ ఎస్ టి పి సేవా సంఘం నుండి కూడా ముగ్గురును ఢిల్లీ పంపిస్తున్నట్లు సంఘం నాయకులు టి.శ్రీనివాసరావు, ఎం చిరంజీవి,జగన్మోహన్ లు చెప్పారు.నేడు డిల్లీలో అవార్డుని అందుకోవడానికి తాను, సెక్రెటరీ, మరో ముగ్గురు కలిసి వెళ్తున్నామని సర్పంచ్ సింహాచలం చెప్పారు. ప్రయాణానికి సంబందించి జిల్లా అధికారులు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదని, డిల్లీలో కూడా తమ స్వంత ఖర్చులతో తాము ఉండేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సర్పంచ్, కార్యదర్శిలు తెలిపారు. జోగమ్మపేటకు అవార్డు ప్రకటనతో రెండు జిల్లాలో అధికారులు హంగామా చేసిన సీతానగరం మండల అధికారులను గాని, జోగమ్మపేట పంచాయతీ సర్పంచ్, కార్యదర్శిలను గాని ఇంతవరకు ప్రశంసలు చేసిన దాఖలాలు లేవన్నది వారి మాటలో అవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో వర్షపు జల్లులు

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఎస్.కోట మండల పరిధి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షపు జల్లులు కురిసాయి. చిన్నపాటి ఈదురుగాలులతో పాటు ఒక్కసారిగా మబ్బులతో చీకట్లు కమ్ముకున్నాయి. తదనంతరం ఉరుములు, మెరుపులతో పాటు కొన్ని గ్రామాల్లో చిరు జల్లులు పడగా సీతారాంపురం, కొట్టాం, ధర్మవరం, పోతనాపల్లి ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఇదిలా ఉండగా మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఉష్ణోగ్రతతో కూడిన ఎండకు ప్రజలు తల్లడిల్లిపోతున్న సమయంలో కురిసిన వర్షంతో ఒక్కసారిగా చల్లని వాతావరణం ఏర్పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షపు జల్లులు నువ్వు, చెరకు, గడ్డి పంటకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కోటమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – శృంగవరపుకోట : జిల్లా ప్రజల ఇలవేల్పు, కొట్టాం గ్రామదేవత కోటమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్.జగన్నాథం ఆధ్వర్యంలో ఉదయం నుంచి కుంకుమ పూజలతో పాటూ అర్చనలు జరిగాయి. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పసుపు, కుంకుమలతో పాటూ చీరలు, రవికెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులతో తరలివచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో గల షెడ్లలో వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేసారు.

క్రీడా సామగ్రి వితరణ

విశాలాంధ్ర – గరివిడి: మండలంలో నడిపేన పేట గ్రామంలో గ్రీన్ నేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో సమ్మర్ సెలవులు సందర్భంగా యువతకు ఫుట్‌బాల్ కిట్లు, షటిల్ కిట్లు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ నేచర్ ఫౌండేషన్ చైర్మన్ మీసాల కొండలరావు, మేనేజర్ రామకృష్ణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాకోడులో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు రాకోడు గ్రామంలో వెంకట పద్మ ఫౌండేషన్ (వెంకట పద్మ హాస్పిటల్) రాకోడు సర్పంచి వసుపు రెడ్డి వెంకటరమణ, వైస్ సర్పంచ్ జి.మహేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ంలో ఉన్న చిన్నపిల్లలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమన్నారు. శిబిరంలో వెంకట పద్మ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మల్లా వెంకటేశ్వర చిన్నపిల్లల వైద్యనిపులు, డాక్టర్ దేవి ప్రసాద్, డాక్టర్ సంతోష్, డాక్టర్ లావణ్య, ఆశ వర్కర్స్ పైడమ్మ, శాంతమ్మ, అంగన్వాడి స్టాఫ్ పరుపు రెడ్డి మాధవి, దేవి, రామలక్ష్మి ఎర్నమ్మ, వెంకట పద్మ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్రమాద మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఇటీవల ఒడిస్సా రాష్ట్రం బాలాసోర్ సమీపంలో జరిగిన కోరమాండల్, గూడ్స్, యశ్వంత్ పూర్ రైళ్ల ఢీకొన్న ఘటనలో వందలాది మంది మృతులకు నివాళులర్పిస్తూ ఎస్.కోట పట్టణంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. యువకులు, పెద్దలు రైల్వే ప్రమాద మృతులు అమర్ రహే..అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయ వాది టీవీఎస్ సన్యాసిరావు మాట్లాడుతూ రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్న ప్రమాదం కేవలం రైల్వే అధికారుల తప్పిదం వల్లనే జరిగిందని, విచారణలతో సంబంధం లేకుండా వెంటనే మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియాతో పాటు కుటుంబానికో ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ మాట్లాడుతూ మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో సుమారు 300ల మంది ప్రయాణికులు మృతి చెందటం మహా విషాద ఘటనగా అభివర్ణించారు. రైల్వే ఉన్నతాధికారులు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నూతన కాంట్రాక్టు విధానం వల్లనే ఈ.ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఎస్.కోట బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యు.ఎస్.శర్మ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందిన ఈరోజుల్లో కూడా ఇలా మూడు రైళ్లు ఢీకొన్న సంఘటన జరగడం.. ప్రమాదంలో 290మంది మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. సీపీఐ మండల ఉప కార్యదర్శి షేక్ స్వామి, టీడీపీ నాయకుడు వసంత సత్యారావు, మోటారు, ఆటో, ఏఐటీయూసీ నాయకులు, ప్రజలు, జర్నలిస్టులు ఈ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారు

– రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్.నరసింహారావు

విశాలాంధ్ర – శృంగవరపుకోట : అద్భుత ప్రతిభ కలవారు దివ్యాంగులు అని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్. నరసింహారావు అన్నారు. ఎస్.కోటలోని ఆర్.కె.ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎన్.పి.డి.ఓ సంయుక్త కార్యదర్శి జె.రమణ నేతృత్వంలో నిర్వహించిన దివ్యాంగుల హక్కులు– చట్టాలు అన్న అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎం.పి జి.వి.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ నరేంద్రమోదీ బాధ్యతలు తీసుకున్న తర్వాత అంగవైకల్యం ఉన్నవారిని దివ్యాంగులు అని పిలిచారు. పలు రంగాల్లో దివ్యాంగులు తమ ఇబ్బందుల్ని పక్కన పెట్టి విజయాలు సాధించారన్నారు. దివ్యాంగుల్ని గుర్తించటం మనందరి సామాజిక భాద్యత అన్నారు. దేశంలో సుమారు 2 కోట్లకు పైగా దివ్యాంగులు ఉన్నారన్నారు. వీరి పట్ల అధికారుల్లో, రాజకీయపక్షాల్లో సరైన భాద్యత లేదని, ఇందుకు ప్రజల్లో దివ్యాంగుల పట్ల తగిన మార్పు సాధించేందుకు ప్రముఖులచే మాట్లాడించాలన్నారు. అందుకు సోషల్‌మీడియాను వేదిక చేయాలని సూచన చేశారు. అన్ని సంస్థలను ఏకీకృతం చేయాలన్నారు.. 25 లక్షల దివ్యాంగుల్లో 15 లక్షల మందిని మీరు కలిపితే అదే పెద్దశక్తి అవుతుందని, అప్పుడు ప్రభుత్వాలు, నాయకులు మీ వెంటే ఉంటారన్నారు. ప్రధాని నేటి వరకూ 14వేల క్యాంప్లు పెట్టి 25 లక్షల మంది దివ్యాంగులకు పరికరాలు అందించారన్నారు. రాష్ట్రంలో పలు పథకాలుఅమలుకు నోచలేదని. దివ్యాంగుల పట్ల ప్రభుత్వాల వైఖరి మారేలా ప్రయత్నం జరగాలన్నారు. ఎ.పి.వికలాంగుల నెట్వర్క్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ సుమారు 25 లక్షల మంది దివ్యాంగులు ఉంటారని, వాళ్లని ఏ రాజకీయ పక్షాలు గుర్తించటం లేదన్నారు. దివ్యాంగుల్లో అద్భుతాలు చేసి రాణించివారున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్.పి.డి.ఓ ప్రతినిధులు జీలకర్ర రమణ, కె.మధు, భువనేశ్వరీదేవి. ఎస్. మహేష్. కె.. దాలినాయుడు, ఆర్.ప్రసాద్, పి.భానుప్రకాశ్, ఎ. అప్పారావు, ఎస్.సన్యాసినాయుడు, షేక్ నూర్ బాషా, వి.మధుసూధనరావు తదితరులు హాజరై ప్రసంగించారు. ఐదు మండలాలకు చెందినననన ధివ్యాంగ సంఘాల ప్రతినిధులు, పలువురు దివ్యాంగులు హాజరయ్యారు.

జాయినింగ్ హాండ్స్ వెల్ఫేర్

సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

విశాలాంధ్ర – కొత్తవలస: మండలంలో నిమ్మలపాలెంలో ఉన్న జాయినింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వీరభద్రపురం గ్రామానికి చెందిన ఎస్.సాయి బాబుకి ఆరోగ్య సమస్యలు కారణంగా సొసైటీ తరువున 5,000/- ఆర్థిక సహాయం అందజేసినట్లు అధ్యక్షులు గొంప రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సాయి బాబు కుటుంబ పోషకార్థం ఇబ్బందికరంగా ఉందని విషయం తెలుసుకుని గతంలో ట్రస్ట్ తరుపున దాతల సహకారంతో రూ.10500/- లు సహాయం చేయటం జరిగిందని అన్నారు. ట్రస్టు సభ్యులు సిరిమల్ల పైడిరాజు మాట్లాడుతూ ఈ ట్రస్టు ద్వారా గడిచిన రెండేళ్లలో ఎన్నో పేద కుటుంబాలకు, అనాధ వృద్ధులకు, దాతల సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని తెలిపారు. ముున్ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటాము అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సిరిమల్ల పైడి రాజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపానికి అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర – తెర్లాం: తెర్లాం మండలంలో భానుడు దాటికి తట్టుకోలేక ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉదయం 8:00 గంటల నుంచి సూర్యుడు కిరణాలు అగ్ని జ్వాలలు గా ప్రజలు పై విరజల్లుతున్నాయి. ఆ వేడికి తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు చాలా ఇబ్బందులకు గురై సొమ్మసిల్లిపోతున్నారు. సూర్యుడు మూడో కన్ను తెరవడం అంటే ఇదేనేమో అంటూ ప్రజలు ఆందోళన చెందుతూ ఆకాశం వైపు చూస్తూ, వరుణ దేవుడును వేడుకుంటూ వర్ష రూపంలో కిందకు దిగి వచ్చి భూమిని చల్లపరిచి, వేడి తీవ్రతను తగ్గించాలని, ప్రజలను , జీవరాశులను రక్షించాలని ఆకాశం వైపు చూస్తూ వరును దేవుడును వేడుకుంటున్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర – తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంధాలయంలో పేపర్ క్రాఫ్ట్, బేటమెన్ సెటిల్ ఆటలు ఆడించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా స్థానిక హైస్కూల్ క్రాఫ్ట్ టీచర్ కే.విస్సు విద్యార్థులకు చిత్రలేఖనం గీసి వాటిని కలర్స్‌తో రంగులు ఏ విధంగా వేయాలి తెలియజేసారు. కలర్ పేపర్స్ అందమైన డిజన్స్ తయారు చేసి పిల్లలకు అందమైన పువ్వులు , అందమైన బొమ్మలు విద్యార్థుల చే ఎలా వెయ్యాలి అని నేర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి 17 మంది విద్యార్థులు పాల్గొన్నారని స్థానిక గ్రంధాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.

మొబైల్‌ను వ్యసనంగా మార్చుకోవద్దు

విశాలాంధ్ర – తెర్లాం/బాడంగి: బాడంగి గ్రంథాలయంలో ఈ వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా 28వ రోజు ఆదివారం మోటివేషనల్ స్పీకర్, గూగుల్ సర్టిఫైడ్ విద్యావేత్త పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రవి బాబు పిల్లలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొబైల్ ఫోన్లు మానవ జీవితాలను ఏవిధంగా నాశనం చేస్తున్నాయో వివవరించారు. పిల్లలు, పెద్దలు మొబైల్ ఫోన్లను వ్యసనంగా మార్చుకోవడం వలన తమ జీవితాల్లో అనారోగ్య, మానసికంగా సమస్యలు ఎదురవుతాయని, కంటి సమస్యలు, ప్రవర్తనా మార్పులు, నిద్ర లేమి, ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, చదువుపై ఏకాగ్రత నిలపలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. మొబైల్ ఫోన్ల నుండి ఏవిధంగా దూరంగా ఉండాలి అనే విషయాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బోధించడం జరిగింది. వీటితో పాటు బాడంగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ రహీమ్ పిల్లలకు ఆటలు, కథలతో పాటు చదివించడం అదే విధంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు జగన్నాథరావు పిల్లలకు స్వాతంత్ర్య సమర యోధులు వారి జీవిత విశేషాలు బోధించడమే కాకుండా పిల్లలు ఏవిధంగా ఉండాలి చెపుతూ జీకే బిట్స్ చెప్పారు.

మినీ గోకులాలకు బిల్లులందేనా!

విశాలాంధ్ర – తెర్లాం: మండలంలో 2018–19 సంవత్సర కాలంలో 117 మినీ గోకులాలు మంజూరు చేయబడ్డాయి. అయితే మినీ గోకులాలను రైతులు అప్పట్లో సొంత నిధులతో ఆదరాబాదరాగా నిర్మాణాలు చేశారు. అప్పట్లో మూడు రకాల షెడ్లు నిర్మాణం చేసుకోవచ్చని రెండు ఆవులు, నాలుగు ఆవులు, ఆరు ఆవులు నివసించు గల షెడ్డులు నిర్మాణం చేసుకోవచ్చని అధికారులు చెప్పడంతో రైతులు 117 షెడ్లు నిర్మాణం చేశారు. అందులో 48 షెడ్డులకు 20 లక్షల 125 రూపాయలు ఎఫ్‌టిఓలు జనరేట్ చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో అక్కడితో మినీ గోకులాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయాయి. ఇటీవల ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మినీ గోకులాలు, వాటి నిర్మాణాలు బిల్లు పేమెంటుపై పశు వైద్యాధికారి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లకు రివ్యూ చేయడంతో నిర్మాణం చేసిన రైతులకు ఆశలు చిగురించాయి.